# సంసారం పార్కున పడింది

శ్రీనగర్ కాలనీ పార్కు ముందు మోటార్ బైక్ ఆపి, ఓ జంట లోపలికి వచ్చి వాకింగ్ ప్రారంభించారు. ఓ అరగంట నడిచి, తిరుగు ప్రయాణమయ్యారు. అతను ప్యాంటు జేబులు వెతుక్కున్నాడు. బైక్ తాళం కనపడలేదు.

పెందరాడే ఇంటికి వెళ్తే వంట చెయ్యాలన్న భయంతో, పార్కు బయట సిమెంట్ బెంచీల మీద కూర్చున్న ఓ నలుగురు, "ఎంతసేపు ఇలా ఊరికే కూర్చుంటామన్న" దిగులుతో ఉన్న సమయంలో, ఏదో వెతుకుతున్న కేసు దొరికినందుకు సంతోషంతో, "ఏం సార్! ఏదో వెతుకుతున్నారు. ఎటిఎం కార్డుతో ఉన్న మనీ పర్సుగానీ పోలేదు కదా" అన్నారు.

"లేదండీ! బైక్ తాళం చెవి కనపడటం లేదు"

"అయ్యో! ఎటిఎం కార్డా పాడా! ఎన్నిసార్లు చెప్పినా కార్డు తీసుకోరు ఈయన!" అంది భార్య.

"ఊరుకో సుమతీ! నేను మగాడ్ని మాట్లాడుతున్నాను కదా! పరాయి మగాళ్లతో అనవసరమైన ప్రస్తావన ఎందుకు చేస్తావ్, నీ పేరుకి తగినట్లుగా ప్రవర్తించమని అనేకసార్లు చెప్పాను!" అన్నాడు పురుషోత్తమ్.

"అయ్యా తమ పేరు పురుషోత్తమ్. మీరు ఉత్తమ పురుషుడిలా ప్రవర్తిస్తున్నారా?" అంది సుమతి.

"అసలు పతివ్రతలు భర్త పేరు చెప్పకూడదు. ఈ విషయం నీకు చాలాసార్లు చెప్పాను".

"మీరు ఇంటికెళ్లి గొడవలు పడొచ్చు! పది గంటలకి పార్కు గేటు తాళం వేసేస్తారు, లోపలికి వెళ్లి తాళం వెతుక్కోండి ముందు" అన్నాడు ఇంట్లో మాట్లాడటానికి ధైర్యం లేని ఒకడు.

వెంటనే ఆ పని మొదలుపెట్టాడు పురుషోత్తమ్.

"బయటివాళ్లు ఏం చెబితే అది చేసేస్తారు! కట్టుకున్న పెళ్ళాం చెబితే మాత్రం వినరు. అందుకే ఆయన చేతిలోంచి పడిపోయిన ఈ బైక్ తాళం దాచేశాను. మీరే చూశారు కదా చిన్న విషయానికి 'సుమతీ! నీ పేరుకు తగినట్లు ప్రవర్తించ'మన్నారు. నా తప్పేమైనా ఉందా అన్నయ్యగారూ" అంది, ఆ గుమిగూడిన వారిలో ఒకడ్ని ఉద్దేశించి.

అక్క చెల్లెళ్లు లేని అభాగ్యుడతను. వెంటనే "నీ కాలి మడమ మీద పుట్టుమచ్చనై

చెల్లెమ్మా' అనే పాట పాడుతూ తర్వాత ఎప్పుడైనా చూద్దాంలే అని "నీ తప్పు అసలేం లేదు చెల్లెమ్మా" అంటూ తను కూడా మగాడినన్న విషయం మరిచిపోయి "ఈ వెధవ మగాళ్లెప్పుడూ ఇంతే!' అన్నాడు.

"మీకు స్వపర భేదం లేదు అన్నయ్యా! ఓ అరగంట వెతికి బయటకి వచ్చిన తర్వాత తాళం ఇచ్చేద్దాం" అంది. అక్కడ ఉన్న వాళ్ళందరూ ఆమె పుట్టింటి వాళ్లలా "సరే" అన్నారు.

"అసలు కొన్నికొన్ని బాధాకరమైన నా సంసార విషయాలు చెప్పాలి మీకు. మా పెళ్లయి రెండేళ్లు అయింది. ఒక సినిమా లేదు, షికారూ లేదు. నేను కూడా మీతోపాటు వాకింగ్‌కి వస్తానంటే ఒప్పుకోరు. ఈరోజయినా బలవంతంగా తప్పక తీసుకువచ్చారు. అందుకనే సరదగా ఏదో సరసమాడడానికి బైక్ తాళం దాచేశాను. పైగా నిద్రలో లేచి బాత్రూమ్‌కి వెళ్లేటప్పుడు, రెండుసార్లు గెంతుతూ," ఏకొమ్మా! నిన్నెలా అయినా అందుకుంటానే" అంటారు ఒక్కొక్కసారి పలవరింతలు. 'మీకు చెమట బాగా పట్టింది. ఫ్యాన్ కింద కూర్చోండి' అనడం, కొంచెం వ్యవధిలో 'అమ్మో! కొట్టడానికి వస్తున్నాడు' అనడం" అంటూ కళ్ల నీళ్లు పెట్టుకుంది సుమతి.

ఇవన్నీ విన్న ఒకడు "అబ్బ! ఎలా భరిస్తున్నావో కానీ చాలా కష్టం తల్లీ!" అన్నాడు.

తెలుగు భాష మీద పట్టుగల ఒకడు "కొమ్మ అంటే చెట్టు కొమ్మే కాదు, కొమ్మ అంటే 'స్త్రీ' అన్న అర్థం కూడా ఉంది" అన్నాడు.

"ఊరుకోవయ్యా! అసలు ఆడకూతురు ఏడుస్తూంటే, తెలుగు మాటకి నానా అర్థాలొకటి!" అన్నాడు.

ఇంతలో పురుషోత్తమ్ "తాళం చెవి దొరకలేదం"టూ పాలిపోయిన మొహంతో వచ్చాడు.

"తాళం చెవి దొరకపట్టుకోలేని మీరు పురుషోత్తములు.! మీలో ఏం ఉత్తమ గుణాలు చూసి మీవాళ్లు ఈపేరు పెట్టారో నాకర్థం కావడం లేదు".

"అదే వద్దన్నాను. కురూపికి సుందరరావనీ, కోపిష్ఠికి శాంతి స్వరూప్ అనిపేర్లు పెడతారు చాలామంది. ఏదైనా అంటే అటువంటి వాళ్లని అను. అంతేకానీ మా వాళ్లని ఏదైనా అంటే నేను ఊరుకోను"

"చూశారా అన్నయ్యలూ! ఇదీ వరస. ఇదిగో ఇది బైక్ తాళమే కదా! బైక్ కిందనే పడి ఉంది. చంకలో పిల్లాడ్ని పెట్టుకుని ఊరంతా వెతికినట్లుంది" అంటూ, తను దాచేసిన తాళం ఇచ్చేసింది.

అన్నయ్యలు "సై" అన్నారు.

ఆ జంట నిష్క్రమించిన తర్వాత "అసలు ఇంత బోళాపిల్లకి కేవలం పేరుకే పురుషోత్తముడైన ఈ పిల్లాడి సంబంధం ఎలా వచ్చిందో!" అన్నాడు ఒకడు.

"మీకు కొంచెం వ్యవధి ఉంటే నేను వివరిస్తా" అన్నాడు ఒకడు.

"అయ్యో! ఈవేళ ఆదివారం కదా బోల్డు వ్యవధి. పెందరాడే వెళితే మా ఆవిడ బట్టలు ఉతికిస్తుంది".

"అయితే ఒకే" అని పూర్వగాథ మొదలు పెట్టాడు. "ఈ అమ్మాయితో పెళ్లి అవ్వక ముందు పురుషోత్తమ్‌కి యిక సంబంధం నిశ్చయమవుతుందన్న సమయంలో, రెండు వేర్వేరు సంబంధాలు కుక్క ముట్టుకుపోయాయ్."

"అరే! అన్నం కూరలూ వగైరా కుక్క ముట్టుకు పోవడం విన్నాం గానీ సంబంధాలు కూడా కుక్క ముట్టుకుపోతాయని తెలీదు" అన్నాడు ఒకడు.

"అసలు విషయం చెపుతాను విను. అసలు ఈ పురుషోత్తమ్ ఎటువంటి వాడో తెలుసుకుందామని, ఇతడు పార్కులో వాకింగ్‌కి వస్తాడని తెలుసుకుని ఇతడ్ని పరిశీలించడం మొదలుపెట్టారు పిల్ల తరపువాళ్లు".

"తర్వాత" అన్నాడు ఒకడు.

"కిరాణా కొట్టుసేఠ్‌కి నెల సరుకులు చెపుతూంటే, 'ఆ తర్వాత... ఆ తర్వాత' అన్నట్లు నువ్ 'తర్వాత' అనకపోయినా నేను పూర్తిగా చెపుతాను. నువ్ అనవసరంగా శ్రమపడకు. ఈ పురుషోత్తమ్ ఇదే పార్కులో నడిచేటప్పుడు హఠాత్తుగా ఎగిరి ఓ చెట్టుకొమ్మ వంచి ఆకులు కోసి నోట్లో పెట్టుకుని, 'థూ థూ' అని ఉమ్మెయ్యడం చూసిన పిల్ల తరపువాళ్లు 'బ్రహ్మచారి శత మర్కటః' అనుకున్నారు. తర్వాత పార్కులో నడిచేవాళ్లలో ఒక నలుగురు కలిసి గట్టిగా 'హ్హాహ్హాహ్హా' అంటూ నవ్వేవారు. అది కూడా ఓ వ్యాయామమట. వాళ్లని చూసి పార్కులోని కొంతమంది 'పాపం వీళ్లకి ఇంట్లో గట్టిగా నవ్వుకునే హక్కు కూడా లేనట్లుంది' అనుకునేవారు. ఎందుకో తెలీదు గానీ రెండు మూడు రోజులు ఆ నవ్వుల గ్రూపు వారు పార్కుకి రాలేదు. వాళ్లు రాకపోయినా సరే ఈ పురుషోత్తమ్ ఒంటరిగా వికటాట్టహాసాలు చేశాడు. పెళ్లి సంబంధం కుదిరేవరకైనా జాగ్రత్తగా ఉండాలని తెలియని అజ్ఞాని.! ఈ వికటాట్టహాసాలు చూసిన పిల్ల తరపు వాళ్లు పిల్లాడికి మతిస్థిమితం లేదనుకున్నారు. పెళ్లికి ముందు మతిస్థిమితం లేనివాడు పెళ్లయిన తర్వాత ఇంకా ముదిరిపోతాడేమోనన్న భయంతో సంబంధం వదిలేశారు. తర్వాత కొన్నాళ్లకి విపరీతంగా నడిచిన ఒక పడతకి చాలా చెమట పట్టింది. ఈ పురుషోత్తమ్ ఆమె దగ్గరికి వెళ్లి "మేడమ్ చాలా చెమట పట్టేసింది మీకు, వెంటనే ఇంటికెళ్లి ఫ్యాన్ కింద కూర్చోండి" అని ఓ

ఉచిత సలహా పారేశాడు. ఆ దగ్గర్లోనే ఉన్న ఆమె భర్త వాకింగ్ మానేసి ఆమె దగ్గరికి వచ్చి విషయం తెలుసుకుని, నా భార్య చెమట గురించి నేనే పట్టించుకోను, నీకేం సంబంధం రా!" అన్నాడు. కంగారుపడిన పురుషోత్తమ్ 'సంబంధం ఎవరితో సార్' అన్నాడు.

'చవటా! చెమట గురించి మాట్లాడిన నువ్ సంబంధం ఎవరితో అని అడుగుతావా?' అని రెండు పీకబోయాడు. 'సారీ సర్' అంటూ, 'ఈరోజు నాకసలు బాగా లేదు అసలు పెళ్లాం చెమట పట్టించుకోను అంటాడేమిటి? అసలు ఈ ప్రపంచంలో ఒకళ్ల చెమట ఇంకొకళ్లు పట్టించుకుంటారా! అదేమయినా గంధమా, ఒంటికి పూసుకోవడానికి' అనుకుంటూ పార్కు నుంచి నిష్క్రమించాడు పురుషోత్తమ్. ఇలా వచ్చిన సంబంధాలు చెడిపోయిన పురుషోత్తమ్ నిరాశపడిపోయి కృంగిపోయాడు. ఆఖరికి ఈ సుమతికి వీడితో ఘటన, ఏం చేస్తాం!"

"అసలు ఇన్ని విషయాలు తెలిసిన నువ్ ఆ పురుషోత్తమ్‌గాడ్ని నిలదీసి అంతకు ముందు సంబంధాలు చెడిపోయి ఏడుస్తున్న సమయంలో ఈ సుమతి నీకు దొరికింది కదా! ఆమెను ఎందుకు బాధపెడుతున్నావ్! అని అడగకపోయావా?" అన్నాడు ఆ గుంపులోని గోవిందుడు ఒకడు.

"ఏం ఫర్వాలేదు! ఈసారి నువ్ అతన్ని కలిసినప్పుడు అడుగుదువు గానీ!"

"సరే! ఇక ఇళ్లకి నడవండి!" అనగానే "ఆటలు పాటలు చాలించి మన ఇళ్లకి మనమూ పోదామా!" అంటూ తమ తమ నిజ గృహాలకి బయల్దేరారు.

---

(ఆంధ్రభూమి వారపత్రిక 29-12-2011)